ప్రజాశక్తి
గురువారం 4 జులై 2024
5
శ్రీ సత్యసాయి



ఐసిడిఎస్ ఇన్‌ఛార్జి పీడీగా నాగమల్లేశ్వరి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా ఎం.నాగమల్లేశ్వరి బుధవారం పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. మడకశిర సిడిపిఒగా పని చేస్తున్న నాగమల్లేశ్వరికి ఇన్‌ఛార్జి పిడిగా అదనపు బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమెకు ఐసిడిఎస్ కార్యాల య సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. పిడి మాట్లాడుతూ అందరం కలిసికట్టుగా పని చేసి జిల్లాకు మంచి పేరు తేవాలని తెలిపారు. విధి నిర్వహణలో ఏమాత్రం అలసత్వం వహించకుండా మీ బాధ్యతలను గుర్తెరిగి మెలగాలని సిబ్బందికి తెలిపారు. ఐసిడిఎస్ సీనియర్ అసిస్టెంట్ నారాయణరెడ్డి, జిల్లా కోఆర్డినేటర్ మహేష్, నాగేశ్వరి, మురళి, శ్రీనివాసులు, సిడిపిఒలు అనురాధ, శాంతలక్ష్మి, ఎసిడిపిఒ గీత, వనజాఅక్కమ్మ, సూపర్వైజర్లు శుభరాణి, రజిత, పుష్ప, సుజాత పిడికి శుభాకాంక్షలు తెలిపారు.

పిఎబిఆర్‌కు నిధుల గ్రహణం



పనులకైతే అనుమతులు మంజూరు
నిర్వహణకు నిధులు కరువు
కాలువలకు మరమ్మత్తుల్లేవు
గేట్లకు గ్రీసు లేదు
'అనంత' నీటివనరు పిఎబిఆర్‌కు దిక్కులేదు

ఉమ్మడి అనంతపురం జిల్లాకు గుండెకాయ వంటిది పెన్నహోబిలం బ్యాలెన్సింగు రిజర్వాయర్. అంతటి కీలకమైన ప్రాజెక్టుకు నిధుల్లేక కనీస మరమ్మతులకు నోచుకోకుండా ఉంది. జలవనరుల శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదిస్తే పనులకు అనుమతులిచ్చారు. అయితే పైసలివ్వకపోవడంతో ఎక్కడివక్కడే ఆగిపోయాయి. ఏదైనా అనుకోని పరిస్థితులు ఎదురవుతే మరమ్మతులు లేక ఆపరేటింగు కూడా కష్టమయ్యే ప్రమాదం పొంచి ఉంది. రెండేళ్లుగా నిర్వహణకు నిధులు మంజూరుకాకపోవడంతో ప్రధానమైన ప్రాజెక్టు పరిస్థితి అధ్వాన్నంగా మారింది.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

తుంగభద్ర నుంచి వచ్చే నీరైనా, శ్రీశైలం నుంచి హంద్రీనీవా ద్వారా వచ్చేనీరైనా పెన్నహోబిలం రిజర్వాయర్‌లో నిలువ చేసుకునే అవకాశముంది. అటు సాగు, ఇటు తాగునీటికి రెండింటికి దీని నుంచే నీరు అందిస్తున్నారు. ఇంత కీలకమైన ప్రాజెక్టు నిర్మాణంలోనే లోపాలు తలెత్తాయి. 11 టిఎంసిల సామర్థ్యమున్న ఈప్రాజెక్టు స్పిల్‌వేలో లీకేజీతో ఐదు టిఎంసిలకు మించి నీరు నిలువ చేయలేని పరిస్థితి నెలకొంది. దీనికి జీయో మెమ్బ్రైన్ ద్వారా మరమ్మతులు చేస్తే పూర్తి సామర్థ్యంతో నీరు నిలువ ఉంచవచ్చు. కానీ ఆ పనులు అనేక ఏళ్లుగా ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. ఇకపోతే ఉన్న వరకైనా తక్షణ మరమ్మతులు చేపట్టాల్సినవి ఉన్నాయి. వాటికి కూడా రెండేళ్లుగా నిధుల్లేవు. కేవలం ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. కనీసం రేడియల్ గేట్లకు గ్రీసు పెట్టేందుకు కూడా నిధుల్లేని పరిస్థితులు నెలకొన్నాయి. ఇక కాలువల పరిస్థితి వేరే చెప్పనక్కర్లేదు. ఎక్కడివక్కడే గండ్లుపడ్డాయి. వాటి మరమ్మతులకు 2022లో ప్రతిపాదనలు పంపిస్తే ప్రభుత్వం వాటిని అనుమతులిచ్చింది. కాని పైసలు విడుదల చేయకపోవడంతో టెండర్లు కూడా పిలువడానికి వీల్లేకుండా ఉండిపోయింది.

ఆర్థికమంత్రి అయినా దృష్టి పెట్టేరా ?

ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సొంత నియోజకవర్గంలోనే ఈ ప్రాజెక్టు ఉంది. ఆయనైనా ఈప్రాజెక్టు బాగోగులపై దృష్టి సారించి, మరమ్మతులకు నిధులు విడుదల చేస్తారా లేదా అన్నది చూడాల్సి ఉంది.

అధికారులు చేసిన ప్రతిపాదనలు	అంచనా వ్యయం
పిఎబిఆర్ విద్యుత్ ఛార్జీలు	రూ.31.80 లక్షలు
డ్యామ్ దిగువ భాగంలో డ్రైన్ మరమ్మత్తులకు	రూ.2.00 లక్షలు
డ్రైనేజీ గ్యాలరీ క్లీనింగు	రూ.4.20 లక్షలు
రేడియల్ గేట్లు, మోటర్లు మరమ్మత్తులు	రూ.6.70 లక్షలు
జనరేటరు రిపేరీ	రూ.4.40 లక్షలు
పనిచేసే సిబ్బందికి	రూ31.10 లక్షలు
పిఎబిఆర్ కాలువ పలుచోట్ల మరమ్మతులకు	రూ.75.30 లక్షలు

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

జేసీ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్



విడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న జేసీ

రెవెన్యూ శాఖ అధికారులు ప్రజలకు మెరుగైన సేవలు అందించి వారి మన్ననలను పొందాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి జిల్లాలోని తహశీల్దార్లు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించి వాటిని పరిష్కరించాలన్నారు. జననం నుంచి మరణం వరకు విద్యార్థులకు అందించే ధ్రువీకరణ పత్రాల విషయంలో రెవెన్యూ అధికారుల పాత్ర కీలకమన్నారు. మెరుగైన సేవలు అందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఎక్కువగా రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యలు ప్రజలు ఎదుర్కొంటున్నారని వాటిపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలను కార్యాలయాల చుట్టూ పదేపదే తిప్పుకోకుండా సమస్యలు శాశ్వతంగా పరిష్కారించడానికి అధికారులు కృషి చేయాలన్నారు. కుల ధ్రువీకరణ పత్రాల జారీ కై అనుసరిస్తున్న విధి విధానాల గురించి వివరించారు. ధ్రువీకరణ పత్రాలు విద్యార్థులకు వేగవంతంగా అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి మున్సిపాలిటీ కమిషనర్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి

ప్రజాశక్తి-హిందూపురం

గురువారం నిర్వహించనున్న దేశ వ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి పిలుపునిచ్చారు. బంద్ విజయవంతం కోరుతు బుధవారం ఎస్ఎఫ్ఐ నాయకులు పట్టణంలోని కళాశాల వసతి గృహాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు లిఖిత్, తరుణ్, విక్రమ్, విద్యార్థులు పాల్గొన్నారు. అదే విధంగా ప్రగత శీల విద్యార్థి సంఘం నాయకులు బంద్ జయప్రదం కోరుతు పట్టణంలోని ఆర్ ఎస్ పి కార్యాలయంలో గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఐక్య విద్యార్థి సంఘం ఇచ్చిన దేశవ్యాప్త విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు మంజుళ నరేంద్ర, బాలు, ప్రవీణ్, మూర్తి, రామాంజి, నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.



ఫోటో:1. విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యాక్షులు బాబావలి

ఆలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని నూతన మార్కెట్, ఐదు లాంతర్ల సర్కిల్‌లో చేపట్టిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ నిర్మాణానికి శాశ్వత ట్రస్టీలు భారీ విరాళాన్ని బుధవారం అందించారు. ఒక ట్రస్టీ రూ.2,01?116 ప్రకారం 8 మంది రూ.16,08.928లను ఆలయ ఖజనాకు జమ చేశారు. ఈ సందర్భంగా దేవాలయం గౌరవాధ్యక్షులు జెఈ వెంకటస్వామి, అధ్యక్షులు రాఘవేంద్ర మాట్లాడుతు రూ. 6 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఆలయం నిర్మాణం కోసం దాతలు విరాళం ఇవ్వటంపై హర్షం వ్యక్తం చేశారు. ఆలయ అభివృద్ధికి దాతలు తమవంతు సాయం చేయాలని ఈసందర్భంగా ఆలయ నిర్మాణ నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షులు అంబికా రఘునాథ్, కార్యదర్శి నిమ్మకాయల రాము, డైరెక్టర్లు చంద్రమోహన్ యాదవ్, నెట్టప్ప, ఎస్ఎస్ అమర్నాథ్, ఆకుల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



నరికివేసిన చీనీచెట్లను పరిశీలిస్తున్న ఎస్ఐ శ్రీనివాసులు

చీనీచెట్లు నరికివేత

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండలంలోని యర్రాయపల్లి గ్రామానికి చెందిన వైసిపి సానుభూతిపరుడు అన్నగిరి శివారెడ్డికి చెందిన 66 చీనీ చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి నరికివేశారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు బత్తలపల్లి మండలం యర్రాయపల్లి గ్రామానికి చెందిన ఈశ్వరమ్మ, శివారెడ్డికి చెందిన మూడు ఎకరాల పొలంలో రూ. 5లక్షలు పెట్టుబడి పెట్టి 430 చీనీ చెట్లను సాగుచేశారు. అందులో అంతరపంటగా టమోటా, కనకాంబరాలు సాగు చేసుకున్నారు. ఏడాది వయస్సున్న చీసీ చెట్లను మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారు. బుధవారం ఉదయం పొలం వద్దకు వెళ్లిన శివారెడ్డి తల్లి రామలింగమ్మ అక్కడ నేలకూలిన చీనీచెట్లను చూసి కుమారుడికి సమాచారమిచ్చింది. శివారెడ్డి ఇచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ శ్రీనివాసులు, పోలీసులు సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. వ్యవసాయం చేసుకుంటూ జీవించే తమకు తమకు ఎవరితోనూ గొడవలు లేవని, శత్రుత్వం కూడా లేదని బాధితులు వాపోయారు. ఎవరు ఎందుకు చేశారో అర్థం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

బిజెపి నాయకులపై ఫిర్యాదు

ప్రజాశక్తి-హిందూపురం

స్థానిక బిజెపి నాయకులు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మకు చెప్పులు చూపించి అవమానిస్తూ దగ్ధం చేయడంపై స్థానిక కాంగ్రెస్ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతకు ముందు పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో రాహుల్ గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు శ్యామ్‌కిరణ్ మాట్లాడుతు పార్లమెంట్ సమావేశాల్లో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బిజెపి, ఆర్ ఎస్ ఎస్ కు వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలను బిజెపి నాయకులు వక్రీకరిస్తు హిందూ సమాజానికి అన్వయిస్తూ అబద్ధపు ప్రచారాన్ని చేసిందన్నారు. ఇది చాలదన్నట్లు రాహుల్ గాంధీని అవమానించే విధంగా దిష్టి బొమ్మను దగ్ధం చేయడం తగదన్నారు. దిష్టి బొమ్మను దగ్ధం చేసిన వారిపై కేసులు నమోదు చేసి, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు యూనస్, కలీం, హనుమంతు రాయుడు, అంజి, ఫిరోజ్, జియా, షఫీ, ఎంపీ ఫిరోజ్, సలాం తదితరులు పాల్గొన్నారు.

వైసిపి కార్యకర్తపై దాడి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం గోళాపురంలో వైసిపి కార్యకర్త సతీష్ పై అదే గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్తలు దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అందుకు సంబంధించి బాధితులు తెలిపిన వివరాల మేరకు మంగళవారం రాత్రి గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్తలు ఆది, సురేష్, రవి కలసి వైసిపి కార్యకర్త సతీష్‌ను మాట్లాడుదామని గ్రామ చెరువు వద్దకు తీసుకెళ్లారు. అక్కడ సతీష్‌పై దాడి చేశారు. అనంతరం గ్రామంలోని సర్కిల్ లో పడేసి వెళ్లారు. అంతేకాక సతీష్ కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి సతీష్ ను కొట్టి ఆక్కడ పడేశామని వచ్చి ఆసుపత్రికి తీసుకెళ్లాలని చెప్పారు. దీంతో వారు సతీష్‌ను హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగళూరు ఆసుపత్రికి తరలించారు. సతీష్‌పై హత్యాయత్నానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని గోళాపురం సర్పంచ్ దేవరాజ్ కోరారు. అయితే ఈ ఘటనపై ఇంత వరకు పోలీసులు కేసును నమోదు చేయలేదని బాధితులు వాపోతున్నారు.

లబ్ధిదారులకు అందని పింఛను

కలెక్టరేట్, ఎంపిడిఒ కార్యాలయాల ఎదుట బాధితుల ఆందోళన
రామగిరి మండలంలో 210 మందికి, బత్తలపల్లి మండలంలో 40 మందికి అందని నగదు
సైట్ క్లోజ్ అయిందని చెబుతున్న అధికారులు




కలెక్టరేట్ ముందు రామగిరి మండలానికి చెందిన పింఛనుదారుల నిరసన

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

రామగిరి మండలంలోని పలు గ్రామాల పింఛను దారులు అర్హులైన తమకు పింఛను ఇవ్వాలని స్థానిక కలెక్టరేట్ ముందు ఆందోళన చేపట్టారు. బుధవారం రామగిరి నుంచి వచ్చిన వృద్ధులు, పింఛను దారులు కలెక్టరేట్ ముందు కూర్చొని ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామగిరి, పోలేపల్లి, ఎంసీ.పల్లి, పిచ్చిరెడ్డికొట్టాల, ఆర్.కొత్తపల్లి, కానుగుల కుంట, గరిమేకల పల్లి తదితర గ్రామాలకు చెందిన 210 మందికి పింఛను ఇవ్వలేదన్నారు. ఇదివరకు తాము ఐదేళ్లుగా ఏ సమస్య లేకుండా పింఛను తీసుకున్నామని ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో టిడిపి నాయకులు చెబితేనే పింఛను ఇస్తామని చెప్పడం దారుణమని వాపోయారు. సచివాలయం సిబ్బంది ఒకటో తేదీ నుంచి కాలయాపన చేసి, చివరకు డబ్బు వెనక్కి వెళ్ళిపోయిందని చెప్పారని వాపోయారు. సుగాలి ప్రీతికి న్యాయం చేయాలని పోరాడిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తమకు కూడా న్యాయం చేయాలని బాధితురాలు సుగాలి నందివర్ధినిబాయి కోరారు. తమకు న్యాయం చేయాలని బాధితులు కన్నీళ్లు పెట్టుకున్నారు.

బత్తలపల్లి : అనంతపురం జిల్లా బత్తలపల్లి మండలం మాల్యవంతం పంచాయతీ పరిధిలోని గ్రామాలకు చెందిన 40 మంది లబ్ధిదారులకు పింఛను ఇవ్వలేదు. దీంతో వారు బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. ఈసందర్భంగా మాల్యవంతం పంచాయతీ పరిధిలోని మాల్యవంతం, ఎం.చెర్లోపల్లి, చీమలనాగేపల్లి, వెంకటగారిపల్లి గ్రామాలకు చెందిన బాధితులు తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. సోమవారం, మంగళవారం పంచాయతీకి చెందిన కార్యదర్శి గంగరత్న, వెల్ఫేర్ అసిస్టెంట్ ఫ్రాన్సిస్ పింఛన్లు పంపిణీ చేపట్టారన్నారు. వారి వెంట ఆయా గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు కూడా వచ్చారన్నారు. అయితే తాము వైసిపి సానుభూతిపరులమన్న కారణంతో పింఛను ఇవ్వకుండా టీడీపీ నాయకులు అడ్డుపడ్డారన్నారు. వారికి పింఛను ఇస్తే మీరు ఉద్యోగాలు ఎలా చేస్తారో చూస్తామంటూ అధికారులను కూడా నాయకులు హెచ్చరించారని బాధితులు చెప్పారు. దీంతో కార్యదర్శి, వెల్ఫేర్ అసిస్టెంట్ తమకు నచ్చజెప్పారని అధికారుల ఆదేశాలతో బుధవారం పింఛను పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. దీంతో తాము ఆగామని అయితే బుధవారం తమకు పింఛను ఇవ్వకపోవటంతో ఎంపిడిఒ కార్యాలయానికి వచ్చి ఆందోళకు దిగామని బాధితులు తెలిపారు. ఆ సమయంలో ఎంపిడిఒ శివనాగప్రసాద్ బాధితులతో మాట్లాడారు. తమకు ఎందుకు పింఛను ఇవ్వలేదని బాధితులు ఎంపిడిఒను ప్రశ్నించారు. దీంతో ఎంపిడిఒకార్యదర్శి గంగరత్న, వెల్ఫేర్ అసిస్టెంట్ ఫ్రాన్సిస్‌తో చర్చించారు. పింఛను ఇవ్వకపోవటానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అయితే బుధవారానికి పింఛను ఇవ్వటానికి సైట్ క్లోజ్ కావటంతో తామేమీ చేయలేమని ఎంపిడిఒ బాధితులకు సమాధానమిచ్చారు. వచ్చే నెల పింఛను తీసుకోవాలని సూచించారు. అప్పుడు కూడా తమకు పింఛను ఇస్తారన్న గ్యారెంటీ ఏమంటూ బాధితులు, వైసిపి నాయకులు ఈసందర్భంగా ఎంపిడిఒను నిలదీశారు. అలా అయితే తామేమీ చేయలేమని ఎంపిడిఒ సమాధానం ఇవ్వటంతో సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని బాధితులు, వైసిపి నాయకులు ఈ సందర్భంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో బాధితులతో పాటు వైసిపి మాజీ మండల కన్వీనర్ బయపరెడ్డి, నాయకులు ప్రతాప్‌రెడ్డి, ఆదర్శ, బోయ సాయి, వెంకటరాముడు, బోయపాటి సూరీ, ముసలప్ప, కమతం శంకర్, గోపాల్, బాబు, రామక్క తదితరులు పాల్గొన్నారు.



బత్తలపల్లి ఎంపిడిఒ కార్యాలయం ముందు బాధితుల ఆందోళన

వృద్ధురాలికి 'పింఛను' కష్టాలు

ప్రజాశక్తి-బత్తలపల్లి

మండలంలోని చీమలనాగేపల్లి గ్రామానికి చెందిన మునిరెడ్డి, నాగలక్ష్మమ్మ దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు వెంకటరెడ్డి, నరసారెడ్డి. వీరు కూలీ పనులు చేసుకుంటూ కుటుంబా లను పోషించుకుంటున్నారు. వృద్ధాప్యంతో మునిరెడ్డి ఆరేళ్ల క్రితం మృతి చెందాడు. నాగ లక్ష్మమ్మ(85) మంచానికి పరిమితం కాగా చిన్నకుమారుడు నరసారెడ్డి పింఛను సొమ్ము తీసు కుంటూ తల్లిని చూసుకునేవాడు. ఈ నెల ఆమెకు పింఛను అందలేదు. దీనిపై ఆమె కొడుకు ప్రశ్నించగా సైట్ క్లోజ్ అయిందని పంచాయతీ కార్యదర్శి గంగరత్న, వెల్ఫేర్ అసిస్టెంట్ ఫ్రాన్సిస్ సమాధానమిచ్చారు. దీంతో ఆమె పింఛను కోసం బుధవారం సాయంత్రం వరకూ ఎంపిడిఒ కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తూ కనిపించింది. దీనిపై



ఎంపిడిఒ కార్యాలయం ముందు పడిగాపులు కాస్తున్న వృద్ధురాలు

ఎంపిడిఒ శివనాగప్రసాద్‌ను వివరణ కోరగా తనకు పుట్టపర్తిలో మీటింగ్ ఉంది వెళ్లాలంటూ సమాధానం దాటవేశారు.



భూ పరిహారం కోసం గ్రీన్ ఫీల్డ్ హైవే పనులను అడ్డుకున్న రైతులు

గ్రీన్ ఫీల్డ్ హైవే పనుల అడ్డగింత

గోరంట్ల : మండలంలోని కొండాపురం పంచాయతీ మల్లెల గ్రామం వద్ద జరుగుతున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు విస్తరణ పనులను బుధవారం బాధిత రైతులు అడ్డుకున్నారు. రైతులు మాట్లాడు తూ రోడ్డు విస్తరణకు ప్రభుత్వం వ్యవసాయ భూములు తీసుకుందే కానీ పరిహారం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మల్లెల గ్రామం వద్ద గ్రీన్ ఫీల్డ్ హైవేకు 15 మంది రైతుల భూమి పోతోంది. కానీ ఆ రైతులకు పరిహారం ఇవ్వకుండా రోడ్డు పనులు చేస్తుండడంతో రోడ్డు పనుల ను అడ్డుకున్నారు. తమకు పరిహారం ఇవ్వాలని పలుమార్లు తహశీల్దార్ కార్యాలయంలో వినతి పత్రాలు అందజేసినా ఫలితం లేదన్నారు. పరిహారం ఇచ్చేంత వరకూ రోడ్డు పనులు జరగని వ్వమని తేల్చి చెప్పారు. సర్వే నెంబర్–42లో 15 మందికి పరిహారం అందాలని రైతులు తెలిపారు



ఖాద్రీశుని సన్నిధిలో కర్నాటక మంత్రి మునియప్ప

ఖాద్రీశుని సన్నిధిలో కర్నాటక మంత్రి

కదిరి అర్బన్ : పట్టణంలో వెలసిన ఖాద్రి లక్ష్మీనరసింహస్వామిని బుధవారం కర్నాటక రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి మునియప్ప దర్శించుకున్నారు. ముందుగా ఆయనకు కార్య నిర్వహణ అధికారి వెండిదండి శ్రీనివాసరెడ్డి, అర్చకులు, రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు తూర్పు రాజగోపురం వద్ద పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి శ్రీస్వామి, అమ్మవార్ల ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు మంత్రికి తీర్థ ప్రసాదములు, శ్రీస్వామి చిత్రపటం, శేషవస్త్రం సమర్పించారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తి అర్బన్ : డీఎస్సీ(ఎస్‌జిటి, స్కూల్ అసిస్టెంట్) ఉచిత శిక్షణకు ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా టెట్ అర్హత సాధించిన బిసి, ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులు ఈనెల 7వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి నిర్మలజ్యోతి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11వ తేదీ నుంచి 60 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, అభ్యర్థులను టెట్ మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తామన్నారు. శిక్షణకు 75 శాతం హాజరైన వారికి స్టయి ఫండ్‌తో పాటు స్టడీ మెటీరియల్ అందజేస్తామన్నారు. వివరాలకు 08554–275575 నంబర్‌కు ఫోన్ చేయవచ్చన్నారు.

ఉపాధ్యాయ అవార్డులకు..

కొత్తచెరువు రూరల్ : జిల్లా వ్యాప్తంగా జడ్పీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు 2023–24 విద్యా సంవత్సరానికి జాతీయస్థాయి అవార్డుల కోసం ఈ నెల 15వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈవో మీనాక్షి బుధవారం తెలిపారు.

ఆవులకు గురక వ్యాధి నివారణ టీకా

సోమందేపల్లి : మండలంలోని పత్తికుంటపల్లి, కొలింపల్లి గ్రామాల్లో వారం రోజులుగా పాడి ఆవులు ఆకస్మికంగా మృత్యువాత పడుతుండడంపై ఉన్నతాధికారులు స్పందించారు. మండల పశు వైద్యాధికారి బాలాజీనాయక్ ఆధ్వర్యంలో బుధవారం చిన్నబావయ్యపల్లి, పత్తికుంటపల్లి, కొలింపల్లి గ్రామాల్లో జెడి శుభదాస్, ల్యాబ్ ఏడి రామచంద్ర ఆధ్వర్యంలో పశువులకు గురక వ్యాధి నివారణ సంబంధిత టీకాలు వేశారు. కార్యక్రమంలో సచివాలయ పశు వైద్యులు, భారతి, ఆశ, మల్లికార్జున, సిబ్బంది పాల్గొన్నారు.

సజ్జపంట సాగు చేయండి : పీడీ

మడకశిర : రైతులు ప్రభుత్వం పంపిణీ చేసే సజ్జలు సాగు చేసి అధిక దిగుబడులు సాధించాలని పిడి కెఎన్.నరసయ్య తెలిపారు. గుడిబండ వ్యవసాయ ఉత్పత్తిదారుల సమాఖ్యలో బుధవారం అగళి, అమరాపురం, గుడిబండ, మడకశిర, రొళ్ల, పరిగి, రొద్దం మండలాల్లోని 60 మంది మహిళా కిసాన్ రైతులకు 1.5 కిలోలు ఉన్న 98 ప్యాకెట్లను పిడి పంపిణీ చేశారు. పిడి మాట్లాడుతూ దేశం మొత్తం చిరుధాన్యాలకు ప్రాధాన్యత ఇస్తున్న తరుణంలో సబ్సిడీ ద్వారా సజ్జలు, రాగులు తీసుకున్న ప్రతి రైతు పంట పండించి మంచి దిగుబడులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో డిపిఎంయు నుంచి వెంకటప్ప, ఎపిఎం, 7 మండలాల రైతులు, మడకశిర క్లస్టర్ పరిధిలోని ఎఫ్‌పిఒ ప్రతినిధులు, ఎపిఎంలు, ఎల్‌సి సిసిలు, సీసీలు, ఎఫ్‌పిఒ సీసీ దేవరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఎల్‌హెచ్‌పిపై తహశీల్దార్‌కు ఫిర్యాదు

గోరంట్ల : స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఆశా వర్కర్లను వేధిస్తున్న ఎంఎల్‌హెచ్‌పిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న ఆధ్వర్యంలో తహశీల్దార్ అక్బాల్‌బాషాకు వినతి పత్రం అందజేశారు. ఆశా వర్కర్లు మాట్లాడుతూ ఎంఎల్‌హెచ్‌పి గౌతమి వేధింపులతో మనస్థాపానికి గురైన ఆశా వర్కర్ శబరి మే 7వ తేదీ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందన్నారు. ఉన్నతాధికారులు ఎంఎల్‌హెచ్‌పి చర్యలు తీసుకోకపోవడంతో విధులను బహిష్కరి స్తున్నట్లు తెలిపారు. బాధిత ఆశా వర్కర్ శబరికి న్యాయం జరిగే వరకూ సమ్మె కొనసాగిస్తామని తేల్చి చెప్పారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు సాంబశివ, ప్రధాన కార్యదర్శి సౌభాగ్య, సహాయ కార్యదర్శి రాధా, మండల నాయకులు ముంతాజ్, మంజుల, శబరి, సుజాత, సరస్వతి, ఇళ్ల స్థలాల పోరాట కమిటీ కన్వీనర్ స్వర్ణలత పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

నల్లచెరువు : స్థానిక జడ్పీ హైస్కూల్‌లో సోషల్ ఉపాధ్యాయుడిగా పని చేస్తూ ఉద్యోగ విరమణ పొం దిన జె.ఈశ్వరయ్యను బుధవారం తోటి ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. 1989లో స్పెషల్ టీచర్‌గా విధుల్లో చేరిన ఈశ్వరయ్య దాదాపు 35 ఏళ్లు ఉపాధ్యాయ వృత్తిలో సేవలం దించి నల్లచెరువు జడ్పీ హైస్కూల్‌లో ఉద్యోగ విరమణ పొందారు. తోటి ఉపాధ్యాయులు ఈశ్వరయ్యను సన్మానించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయ లక్ష్మి, శుభహాన్, పిడి సంధ్య, షఫీ, శ్రీనాథ్‌రెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి, లక్ష్మీదేవి, అనిత, శ్రీదేవి, రమాదేవి, గౌస్‌ఖాన్, శ్రీనివాసులు, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగుపై రైతులకు శిక్షణ

పెనుకొండ టౌన్ : ఖరీఫ్‌కు సన్నద్ధమవుతున్న రైతులకు బుధవారం స్థానిక వ్యవసాయ అధికారి కార్యాలయంలో పంటల సాగుపై సమగ్ర శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీఆర్సీ ఏడీఏ సనా వుల్లా, ఏఓ అబ్దుల్‌అలీ వరి, వేరుశనగ పంటల సాగు విధానం, కలుపు, ఎరువుల యాజమా న్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కందిలో ఎల్‌ఆర్‌జి–52 రకాన్ని ప్రభుత్వం సరఫరా చేస్తోందని తెలిపారు. డ్రోన్ ద్వారా పురుగు మందులు పిచికారి చేస్తే ఖర్చు తగ్గటమేగాక నీరు ఆదా అవుతుందని వివరించారు. వేరుశనగలో అంతర పంటగా ఆముదం, కంది 5:1 నిష్పత్తి లో వేస్తే మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. తెగుళ్ల నివారణకు పురుగు మందుల వాడకాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయం చేయాలని సూచించారు. ద్రవరూపంలో యూరియా, డిఎపి పంటలపై పిచికారి చేయడం వల్ల, డ్రోన్ల సాయంతో రసాయన మందులను పిచికారి చేయడం వల్ల సాగు ఖర్చు గణనీయంగా తగ్గుతుందని తెలిపారు. కార్యక్రమంలో పెనుకొండ ఎడిఎ కె.స్వయంప్రభ, ఏఓ కెసి.చందన, ఏఈఓ, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



రైతులకు సజ్జలు పంపిణీ చేస్తున్న పీడీ నరసయ్య

విద్యుత్ సరఫరాలో అవాంతరాలు తలెత్తకూడదు

అధికారులకు మంత్రి సత్యకుమార్ ఆదేశం

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. విద్యుత్ శాఖకు సం బంధించి సమస్యలు తెలుసుకునేందుకు మంత్రి ఇంజినీరింగ్ సలహాదారు మండలి సభ్యులు ఒంటేరు శ్రీనివాసులురెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, విశ్రాంత డీఈ వేణుగోపాల్‌రెడ్డి, విశ్రాంత ఎస్‌ఈ వెంకటసుబ్బయ్య, ఎంపీపీ ఆదినారాయణ బుధవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. విద్యుత్ సరఫరాలో సమస్యలు, నాణ్యమైన విద్యుత్ సరఫరాకు అవసరమైన ప్రణాళికలపై వారు ట్రాన్స్‌కో ఈఈ మోజస్, ఏడి సుబ్రహ్మణ్యం, ఇన్‌ఛార్జి ఏఈ నరేష్‌తో చర్చించారు. అనంతరం మంత్రితో ఫోన్ ద్వారా మాట్లాడారు. మంత్రి ఫోన్ ద్వారా మాట్లాడుతూ అన్ని సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ సిబ్బంది విధులు సక్రమంగా నిర్వర్తించాలని, క్షేత్రస్థాయిలో



ట్రాన్స్‌కో అధికారులతో మాట్లాడుతున్న నాయకులు

వెళ్లి ప్రజల విద్యుత్ సమస్యలు తెలుసుకొని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ముదిగుబ్బ పాతూరుకు 24 గంటలు విద్యుత్ సరఫరా చేయాలన్నారు. సబ్ స్టేషన్ల పరిధిలోని ఖాళీలను భర్తీ చేసేందుకు, మలకవేముల వద్ద సబ్ స్టేషన్ నిర్మాణం త్వరగా జరిగేందుకు, మండల వ్యాప్తంగా అవసరమైన విద్యుత్ సామగ్రిని అందించేందుకు విద్యుత్ శాఖ సీఎండీతో మాట్లాడి త్వరలోనే పరిష్కారమయ్యేలా చూస్తానని మంత్రి తెలిపారు.

అంబేద్కర్ స్ఫూర్తితో చంద్రబాబు పాలన : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో సిఎం చంద్రబాబు పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. చెన్నేకొత్తపల్లిలో బుధవారం 'అందరివాడు' ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అంబేద్కర్ జయంత్యుత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దళితులతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కమిటీ ఆధ్వర్యంలో పరిటాల సునీతను గజమాలతో సత్కరించారు. అనంతరం ఆమె పదో తరగతిలో 500కు పైగా మార్కులు సాధించిన ఎస్సీ విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెమొంటో అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేద్కర్ కేవలం దళిత వర్గానికి చెందిన వారు మాత్రమే కాదని, అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో చంద్రబాబు నేడు ఓ దళిత మహిళకు హోం మంత్రి పదవి



అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

ఇచ్చారన్నారు. అనేక మందికి రాజకీయంగా ప్రాధాన్యత కల్పించార న్నారు. అంబేద్కర్ రాజ్యాంగం వల్ల ఎంతోమంది అట్టడుగు వర్గాల వారికి న్యాయం జరుగుతోందన్నారు. నేడు ఇంత మంది ఎస్సీలు చట్టసభలకు వెళ్తున్నారంటే అది అంబేద్కర్ ఘనతే అన్నారు.

మహిళల జీవనోపాధికి నైపుణ్య అభివృద్ధి శిక్షణ

కియా ఇండియా చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కబ్డాంగ్ లీ

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

గ్రామీణ మహిళల సుస్థిర జీవనోపాధి కోసం కియా ఇండియా నైపుణ్య అభివృద్ధి శిక్షణ కార్యక్రమం చేపట్టిందని కియా ఇండియా చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కబ్డాంగ్ లీ తెలిపారు. సిఎస్ఆర్ పథకంలో భాగంగా టింబక్టు కలెక్టివ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ మహి ళల కోసం టైలరింగ్ శిక్షణ కార్యక్రమం చేపట్టారు. శిక్షణ పూర్తి చేసుకున్న 75 మంది మహిళల కు బుధవారం అమ్మవారుపల్లిలో కుట్టు మిషన్లు పంపిణీ చేయడంతో పాటు ప్రశంసా పత్రాలు అందజేశారు. ముఖ్యఅతిథి కబ్డాంగ్ లీ మాట్లాడుతూ కియా సమీప గ్రామాల్లోని మహిళలను ఆర్థికంగా అభివృద్ధి పరిచేందుకు నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు చేపట్టామన్నారు. అందులో భాగంగా మహిళల టైలరింగ్ శిక్షణకు రూ. 40 లక్షలు ఖర్చు చేశామన్నారు. ఇప్పటికే ఆటో సర్వీస్ టెక్నీషియన్, హెవీ మోటర్ వెహికల్ డ్రైవింగ్, సుబ్బరాయునిపల్లిలో ప్లాంటేషన్ డ్రైవ్, పెనుకొండ జడ్పీ స్కూల్‌లో డైనింగ్ హాల్ నిర్మాణం, వైద్య పరికరాలు, డే కేర్ షెల్టర్, ఎలివేటెడ్ వాటర్ ట్యాంకులు, తదితర అభివృద్ధి పనులు పూర్తి



శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలతో కియా ఇండియా ప్రతినిధులు

చేశామన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసిన మహిళలకు కుట్టు మిషన్లు, ప్రశంసా పత్రం అందజేశారు. కార్యక్రమంలో టింబక్టు వ్యవస్థాపకులు బబ్లు గంగూలీ, కియా ఇండియా ప్రతినిధి తేజశ్వి, అనంతశక్తి సీఈవో లావణ్య, మహాశక్తి ఫెడరేషన్ సుజాత, దుర్గాశక్తి సహకార సంఘం సీఈఓ కవిత పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే రాజు

ప్రజాశక్తి-మడకశిర

రొళ్ల మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని ఎమ్మె ల్యే ఎంఎస్.రాజు తెలిపారు. రొళ్ల మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ కవిత అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తాగునీరు, డ్రెయినేజీ, రోడ్లు, తదితర సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయిస్తానని తెలిపారు. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు చేయాలని, ఆ తర్వాత ప్రజల ఆకాంక్షల మేరకు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సమావేశంలో జడ్పిటిసి అనంతరాజు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న కల్వర్టుల పరిశీలన

నియోజకవర్గ పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కుంచిటి ఒక్కలిగ సాధికార సమితి కన్వీనర్ వి.ఎం.పాండురంగప్ప రొళ్ల మండలంలోని హొట్టేబెట్ట, కొడకార్ల గుట్ట వద్ద వర్షాలకు దెబ్బతిన్న కల్వర్టులను పరిశీలిం చారు. రాకపోకలకు ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే కల్వర్టు పున:నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. వారి వెంట టిడిపి జిల్లా కార్యదర్శి రవిభూషణ్, నాయకులు భరత్, రవికుమార్ ఉన్నారు.



తెగిపోయిన కల్వర్టులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజు, గుండుమల, తదితరులు

ఓసోలార్ పార్క్ కోసం భూమి పరిశీలన

సోలార్ పార్క్ ఏర్పాటు కోసం సుమారు 10వేల ఎకరాల భూమి సేకరించడానికి బుధవారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, గుండుమల తిప్పేస్వామి సోలార్ పార్క్ యజమాని సురేష్‌తో కలిసి మడకశిర మండలంలోని బుల్లసముద్రం, మనూరు, కల్లుమర్రి, హరేసముద్రం పంచాయతీల పరిధిలో భూమిని పరిశీలించారు. ఈ ప్రాంతంలో సోలార్ పార్క్ ఏర్పాటు చేయడం వల్ల ఎంతోమందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుందని తెలిపారు. వారితో పాటు టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, కల్లుమర్రి సర్పంచి నాగరాజు, వడ్డే రఘురాం, సుబ్బారెడ్డి, ఆయా గ్రామాల రైతులు ఉన్నారు.

అతిసార బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

నియోజకవర్గంలో ఎక్కడా అతిసార వ్యాప్తి చెందకుండా వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలని, బాధితులకు మెరుగైన చికిత్స అందించాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ఆదేశించారు. కొత్తచెరువు మండలంలో అతిసారతో బాధపడుతూ స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను ఎమ్మెల్యే బుధవారం పరామర్శించారు. వెంటనే డిఎంహెచ్ఒ మంజువాణికి ఫోన్ చేసి అతిసారపై ఆరా తీయడంతో పాటు వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో డిఎంహెచ్ఒ హుటాహుటిన కొత్తచెరువుకు వైద్య బృందాన్ని పంపించారు. అలాగే అతిసారపై డిఎంహెచ్ఒ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి రోగుల వివరాలు నమోదు చేశామని, ఆయా గ్రామాలకు వైద్యాధికారుల బృందాన్ని పంపించి అతిసార నివారణ చర్యలు చేపడుతున్నట్లు డిఎంహెచ్ఒ ఎమ్మెల్యేకి వివరించారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

నియోజకవర్గంలో మహిళా సాధికారత, విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ఆర్‌డిటి మహిళా సాధికారత విభాగం డైరెక్టర్ విశాల ఫెర్రర్‌ను కోరారు. ఎమ్మెల్యే బుధవారం అనంతపురం నగరంలోని ఆర్‌డిటి కార్యాలయ నివాసంలో విశాల ఫెర్రర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. ఎమ్మెల్యేతో పాటు పివికెకె విద్యాసంస్థల ఛైర్మన్ పల్లె వెంకట కృష్ణ కిశోర్‌రెడ్డి, ప్రిన్సిపల్ సుబ్బారావు, తదితరులు ఉన్నారు.



ఉపాధి పనులపై ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

'ఉపాధి' పనులపై ప్రజావేదిక

ప్రజాశక్తి-లేపాక్షి

2023–24 ఆర్థిక ఏడాదిలో నిర్వహించిన ఉపాధి హామీ పనులపై బుధవారం లేపాక్షి లో ఎంపీడీఓ వాసుదేవగుప్తా ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పిడి విజయేంద్ర ప్రసాద్ హాజరై సమీక్షించారు. మండలంలోని 12 పంచాయ తీల్లో రూ. 11 కోట్ల వ్యయంతో చేపట్టిన 800 పనులకు కూలి డబ్బులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. అందులో రూ. 75 వేలు దుర్వినియోగమయ్యాయని, ఆ సొమ్ము రికవరీ చేయాలని అధికారులు ఆదేశించారు. గతేడాదికి సంబంధించిన రూ. 1.01 లక్షలను రికవరీ చేయకపోవడంపై జిల్లా విజిలెన్స్ అధికారి రమణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎపిడిఒ శివానంద్‌నాయక్, మండల ఇంజినీర్ హనుమనాయక్, ఎపిఒ జ్యోతి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మండలంలోని రామస్వామితండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం హిందూపురం పార్లమెంట్ టిడిపి సోషల్ మీడియా కోఆర్డినేటర్ హేమలతబాయ్ నోటు పుస్తకాలు, పెన్సిల్లు, ఇతర విద్యా సామగ్రి పంపిణీ చేశారు. పాఠశాలకు కుళాయిలు, గ్యాస్ సిలిండర్, గ్యాస్ స్టవ్ అందజేశారు. ఎంఈఓ రమణప్ప, టిడిపి మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి తుమ్మల మనోహర్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. అనంతరం హేమలతను ఎంఈఓ శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేష్‌నాయక్, తులసిబాయ్, టిడిపి నాయకులు గోనుగుంట్ల రామంజి, గడ్డం మోహన్, నంద, చంద్ర, గోపాల్, అబ్దుల్లా, ఫిరోజ్, మనోహర్ పాల్గొన్నారు.

విద్యాశాఖ మంత్రి దృష్టికి ప్రయివేటు స్కూళ్ల సమస్యలు

బత్తలపల్లి : రాష్ట్ర వ్యాప్తంగా ప్రయివేట్ స్కూల్స్ ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారని ఉమ్మడి జిల్లా ఏపీపీఎస్ఏ సభ్యులు మిడతల లక్ష్మీనారాయణ తెలిపారు. స్థానిక శ్రీజ్యోతి హైస్కూల్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఏపీపీఎస్ఏ, ఉమ్మడి జిల్లా ఏపీపీఎస్ఏ సంఘం నాయకులు మంగళవారం విజయవాడలోని నివాసంలో మంత్రి నారా లోకేష్‌ను కలిసి ప్రయివేటు స్కూల్స్ సమస్యలను వివరించగా స్పందించిన మంత్రి నెల రోజుల్లో పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ఉమ్మడి అనంతపురం జిల్లా ఏపీపీఎస్ఏ అధ్యక్షులు గోపాల్ రెడ్డి, రవిచంద్రారెడ్డి, మిడతల లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి, రామాంజనేయులు, పివిఎస్ నాయుడు, గంగాధర, చిత్తయ్య, పెనుకొండ శీన, ఉన్నారు.

ఎన్టీఆర్ తాగునీటి పథకం ప్రారంభం

బత్తలపల్లి : స్థానిక తాడిపత్రి ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ సుజల స్రవంతి తాగునీటి పథకాన్ని బుధవారం టిడిపి మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి, మండల కూటమి నాయకులతో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శుద్ధి చేసిన నీటిని తాగడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చు అన్నారు. కార్యమంలో బీజేపీ మండల కన్వీనర్ ఆకులేటి వీరనారప్ప, జనసేన కన్వీనర్ పూల రవి, గోనుగుంట్ల అమర్‌నాథ్ చౌదరి, కాకర్ల సురేంద్రనాయుడు, నెట్టెం రమణ, జక్కంపూటి నాగభూషణ, చిదంబరరెడ్డి, ముద్దనపల్లి బాలాంజనేయులు, చిత్రా నాగభూషణ, మాల్యవంతం బాబు, అప్పస్వామి, గరిశనపల్లి రవి, తరిగోపుల చంద్రబాబునాయుడు, బి.నారాయణస్వామి, ఉమ్మాల చంద్రశేఖర్, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.



తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న గోనుగుంట్ల నారాయణరెడ్డి, కూటమి నాయకులు

నేరాలు ఘోరాలు

రైలు కిందపడి వృద్ధుడు ఆత్మహత్య

ధర్మవరం టౌన్ : పట్టణంలోని సుందరయ్యనగర్ కాలనీకి చెందిన నరసింహులు(78) బుధవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. హిందూపురం రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు.. నరసింహులు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఉండేవాడు. ఈక్రమంలో తీవ్ర మనస్థాపానికి గురై రేగాటిపల్లి రైల్వే గేటు సమీపంలో బుధవారం ఉదయం రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే కీ మెన్ ఇచ్చిన సమాచారం మేరకు హిందూపురం రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడి భార్య లక్ష్మీదేవి నాలుగేళ్ల క్రితమే మృతి చెందిందని, ఓ కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారని రైల్వే పోలీసులు తెలిపారు.

ప్రమాదవశాత్తూ బావిలో పడి వ్యక్తి మృతి

పుట్టపర్తి క్రైమ్ : రూరల్ మండలంలోని వెంగళమ్మచెరువు గ్రామంలో పింజరి బాబు(55) ప్రమాదవశాత్తూ బావిలో పడి మృతిచెందాడు. రూరల్ ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపిన వివరాలు.. వెంగళమ్మచెరువు గ్రామా నికి చెందిన పింజరి బాబు సోమవారం నుంచి కనపడకపోగా బంధువులు వెతికినా ఫలితం లేకుపోయింది. బుధవారం నారసింపల్లి రోడ్డు గుండా వెళ్లే వారు బావిలో మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నట్లు పేర్కొన్నారు.

జిల్లాలో పోలీసుల ముమ్మర తనిఖీలు

పుట్టపర్తి రూరల్ : జిల్లా ఎస్పీ మాధవ రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం పోలీసులు జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. సాయం త్రం విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తూ అక్రమ రవాణాను అరికట్టేందుకు వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. జిల్లావ్యాప్తంగా ప్రధాన రహదారులు, హైవేలు, పట్టణ ప్రాంతాల్లో ముఖ్య కూడళ్లలో వాహనాలు తనిఖీలు చేశారు. అలాగే రోడ్డు భద్రత నియమాలు ఉల్లంఘించిన వారికి జరిమానా విధిస్తూ, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనం నడిపే ప్రతిఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, జరిమానా వేసినా పదే పదే ధిక్కరిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తనిఖీల్లో పలు వాహనాలను సీజ్ చేసి ఆయా పోలీస్ స్టేషన్లకు తరలించారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

'కాన్వెంట్ వద్దు.. అంగన్వాడీ ముద్దు'

చిలమత్తూరు : 'కాన్వెంట్ వద్దు.. అంగన్వాడీ ముద్దు' అని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లలితమ్మ పిలుపునిచ్చారు. మండలంలోని దేమకేతేపల్లి సెక్టార్ పరిధిలోని బ్రహ్మేశ్వరంపల్లి అంగన్వాడీ కేంద్రంలో బుధవారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. 'కాన్వెంట్ వద్దు.. అంగన్వాడీ ముద్దు'.. 'అంగన్వాడీ విద్య.. ఆటపాటల విద్య' నినాదాలతో అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీచర్లు విజయభాస్కర్‌రెడ్డి, శంకర్ నారాయణ, అంగన్వాడీ కార్యకర్తలు, పిల్లలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను నియమించాలి

కొత్తచెరువు రూరల్ : జిల్లా వ్యాప్తంగా మున్సిపల్, జడ్పీ హైస్కూళ్లలో ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జయచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం డిఇఒ మీనాక్షికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ధర్మవరం, కదిరి, హిందూపురం మున్సిపాలిటీల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేకపోవడంతో బోధనకు తీవ్ర ఆటంకం కలుగుతుందని, తద్వారా విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కావున ఆయా పాఠశాలలోల ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని కోరారు. మున్సిపాలిటీల్లో అప్డేట్ పాఠశాలల్లో సబ్జెక్టు వారీగా టీచర్లను నియమించాలన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు లక్ష్మీనారాయణ, నరేష్ కుమార్, బాబు, బాబావలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

లేపాక్షి : ద్విచక్ర వాహనదారులు ప్రయాణంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ గోపి సూచిం చారు. ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం స్థానిక జాతీయ రహదారిపై వాహనాల తనిఖీలు చేపట్టారు. ఎస్ఐ వాహనదారులతో మాట్లాడుతూ ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించాలని, వెంట వాహనం రికార్డులు ఉంచుకోవాలని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, మద్యం తాగి వాహనం నడపరాదని సూచించారు. రూల్స్ అతిక్రమిస్తే అపరాధ రుసుము వసూలు చేస్తామని తెలిపారు.

కొనసాగిన కార్మికుల నిరాహార దీక్ష

పరిగి : పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ స్థానిక సచివాలయం వద్ద కార్మికుల చేస్తున్న రిలే నిరాహార దీక్షలు మూడో రోజైన బుధవారం కూడా కొనసాగాయి. వారికి సిఐటియు నాయకులు రాము మద్దతు తెలిపా మాట్లాడారు. పంచాయతీ కార్మికులకు న్యాయం జరిగే వరకూ సమ్మె కొనసాగుతుందని, వారికి సిఐటియు మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. దీక్షలో గ్రామపంచాయతీ కార్మికుల సంఘం అధ్యక్షుడు సజ్జప్ప, మండల స్వచ్ఛభారత్ కార్మికులు పాల్గొన్నారు.